ప్రజాశక్తి

సోమవారం 20 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

అచ్చొచ్చిన మైదానంలో నిరాశ

రాహుల్‌ను అవుట్ చేసిన ఆనందంలో ఆసీస్ ఆటగాళ్లు

- రెండో వన్డేలో ఆసీస్ చేతితో భారత్ ఓటమి
- నిప్పులు చెరిగిన మిచెల్ స్టార్క్
- కూలిన ఇండియా టాప్ ఆర్డర్
- దిగాలు పడ్డ అభిమానులు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : **విశాఖ వేదికగా ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో ఆదివారం జరిగిన భారత్ - ఆసీస్ రెండో వన్డే మ్యాచ్ స్థానిక అభిమానులకు నిరాశను మిగిల్చింది. భారత్‌కు అచ్చొచ్చిన మైదానంగా పేరొందిన ఈ స్టేడియంలో చాలా కాలం తర్వాత స్వదేశీ జట్టు చిత్తుగా ఓడిపోవడాన్ని అభిమానులు అంతగా జీర్ణించుకోలేక పోయారు. తమ అభిమాన క్రీడాకారులు అవుటై వెళ్లిపోతుంటే దిగాలుగా ఉండిపోయారు.**

వన్డే మ్యాచ్‌తో మధురవాడ ప్రాంతం క్రికెట్ అభిమానులతో ఆదివారం ఉదయానికే సందడిగా మారింది. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ మ్యాచ్‌లో భారత్ కేవలం 117 స్కోర్ మాత్రమే చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన ఆస్ట్రేలియా 11 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా విజయాన్ని సొంతం చేసుకుంది. వర్షం కారణంగా మ్యాచ్ జరుగుతుందా ? లేదా ? అన్న ఆత్రుతతో ఎదురుచూసిన అభిమానుల్లో ఫలితం తీవ్ర నిరాశ మిగిల్చింది. వరుణుడు కరుణించినా భారత్ తీవ్ర పరాజయంతో భారత్ అభిమానుల్లో దిగాలు నెలకొంది. ఈ మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి టిక్కెట్లు కొనుక్కున్నారు. కొందరు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి బ్లాక్‌లో కొనుక్కొని మరీ భారత్ ఆటను చూసేందుకు వచ్చారు. వారంతా నిరాశకు లోనయ్యారు.

కోహ్లీ అవుటైన క్షణాన నిరాశలో అభిమానులు

భారత్ ఫేవరెట్ మైదానమే అయినా...

ఈ స్టేడియం భారత్ టీంకి అచ్చొచ్చిందని చెప్పుకోవచ్చు. గతంలో జరిగిన పది మ్యాచ్లో ఒక మ్యాచ్ రద్దయింది. ఓ మ్యాచ్‌లో ఇండియా ఓడిపోయింది. మిగిలిన 8 మ్యాచ్‌లనూ గెలిచి రికార్డు సృష్టించింది. ఇదే స్టేడియంలో విరాట్ కోహ్లీ మూడు సెంచరీలు చేసిన ఘనత మిగతా 2లో..

కలెక్టరేట్ ప్రతిపాదిత స్థలం

ముందుకు కదలని కలెక్టరేట్ నిర్మాణం

- స్థలమివ్వడానికి ఉద్యానశాఖ విముఖత
- మళ్లీ మొదటికొచ్చిన సమస్య

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి మార్గం సుగమం కావడంలేదు. డైట్ ఎదురుగా జాతీయ రహదారికి ఆనుకొనివున్న పది ఎకరాల భూమిని కలెక్టరేట్ నిర్మాణ నిమిత్తం ఉచితంగా ప్రభుత్వానికి ఇవ్వడానికి ఒక వ్యక్తి ముందుకొచ్చాడు. అయితే భారీ వర్షాలుపడితే అనకాపల్లి వరద నీరంతా చేరే ప్రాంతంలో కలెక్టరేట్ నిర్మాణం సరికాదని నిపుణులు తేల్చారు. కలెక్టరేట్ నిర్మాణానికి దాత ఇవ్వదల్చుకున్న స్థలం మంచిదికాదని చెప్పడంతో ఆ ఆలోచన నుంచి ప్రభుత్వం విరమించుకుంది. దాత ఇచ్చే స్థలంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం చేపట్టేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఒప్పించడానికి జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొందరు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాలు వెనుకనున్న ప్రయోజనాలను బయటకు చెప్పకపోయినా, ఆ స్థలం నిర్మాణయోగ్యంకాదని నిపుణులు చెప్పడంతో చేసేదిలేక కొంతకాలం మిన్నకున్నారు. అప్పుడప్పుడూ కలెక్టరేట్ నిర్మాణానికి ఆ స్థలాన్ని తెరమీదకు తెస్తున్నారు. వరదనీరు చేరే ప్రాంతం సరికాదని గుర్తించిన అధికార యంత్రాంగం ఇంటిగ్రేటెడ్ మిగతా 2లో..

నగరంలో నాని 'దసరా' సందడి

వార్త 6లో..

విశాఖకు విద్యుత్ బస్సులు

వార్త 6లో..

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం

వార్త 4లో..

చోడవరంలో గృహ నిర్బంధంలో సిఐటియు నేత వరలక్ష్మి

అంగన్‌వాడీల గృహ నిర్బంధం

'చలో విజయవాడ' భగ్నానికి ప్రభుత్వ యత్నం వార్త 5లో..

జంతు సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

వేసవి నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నాం

- ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఇన్‌ఛార్జి క్యూరేటర్ అనంత శంకర్

ప్రజాశక్తి - ఆరిలోవ

వేసవి నేపథ్యంలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జూ ఇన్‌ఛార్జి క్యూరేటర్, డిఎఫ్ఒ అనంత శంకర్ తెలిపారు. సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలను, భవిష్యత్తులో జూ అభివృద్ధికి చేపట్టబోయే చర్యలను, జూ పార్కుకు తీసుకురానున్న కొత్త జంతువుల విశేషాలను ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జంతువుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలేంటి ?

వేసవిని దృష్టిలో ఉంచుకుని జంతువులను చల్లగా ఉంచేందుకు పలు ఏర్పాట్లు చేశాం. పాములు, పులులు తదితర జంతువులకు వాటర్ స్ప్రింకర్లు ఏర్పాటు చేశాం. హైనాలు, తోడేళ్లు, చింపాంజీలకు ఫ్యాన్లు, కూలర్లు అందుబాటులో ఉంచాం. పక్షులకు ఖస్, ఖస్ మ్యాట్‌లు ఏర్పాటు చేసి చల్లదనం కోసం ఎప్పటికప్పుడు నీళ్లతో తడుపుతూ ఉన్నాం. అన్ని జంతువుల నైట్‌హౌస్‌లకూ కూల్ రూఫ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని ఎన్‌క్లోజర్లలో చల్లదనం కోసం చర్యలు చేపట్టాం. వెటర్నరీ వైద్యుల సూచనల మేరకు వేసవిలో జంతువులకు అందించే ఆహారంలో మార్పులు చేశాం.

వేసవిలో సందర్శకుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు ?

వేసవి ప్రారంభం నుంచి జూ సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. హైవే, సాగర్ ముఖద్వారాల వైపు, చిరుతపులి ఎన్‌క్లోజర్ వద్ద, బయోస్కోపు వద్ద నాలుగు ఆర్ఒ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. శుద్ధి చేసిన తాగు నీరు అందుబాటులో ఉంది. మండుతున్న వేడి నుంచి ఉపశమనం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అచ్చొచ్చిన మైదానంలో నిరాశ

కూడా ఉంది. అంతేకాకుండా చివరి టెస్టులో కూడా విరాట్ కోహ్లి సెంచరీ చేసి ఫామ్‌లో ఉన్నందున ఆదివారం విశాఖలో జరిగిన వన్డే మ్యాచ్‌లో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాడని అభిమానులు అనుకున్నారు. కానీ అతడు బ్యాటింగ్‌కి దిగి 31 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఆసీస్ ముందు తక్కువ స్కోర్‌ని ఉంచి బౌలింగ్‌కు దిగిన భారత్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో తేలిపోయారు. 11 ఓవర్లలోనే ఆసీస్ ఓపెనర్లు మ్యాచ్‌ను ఖతం చేశారు. రెండు జట్లూ కలిపి 37 ఓవర్లు మాత్రమే ఆడటంతో అభిమానులు నిరాశచెందారు.

స్టార్క్ ప్రతిభ

ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ ఐదు వికెట్లు తీసి ఉత్తమ ప్రతిభని కనబరిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తను వేసిన ఫస్ట్ స్పెల్‌లో ఐదు ఓవర్లకే నాలుగు వికెట్లు తీసి ఇండియా టాప్ ఆర్డర్‌ను కూల్చివేశాడు. దీంతో లోయర్ ఆర్డర్ భారత్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా బౌలర్ల ముందు నిలవలేకపోయారు.

అభిమానులకు సమాచారం కరువు

చాలామంది అభిమానులు స్టేడియంలోకి ప్రవేశించేందుకు ఇబ్బందులు పడ్డారు. సరైన సమాచారం లేకపోవడంతో స్టేడియం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మూడు చోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించడంతో చాలా మంది లైన్లో ఉండటానికే సమయం సరిపోయింది. ఇష్టమైన భారత్ క్రీడాకారులను తాము చూడలేకపోయామని చాలా మంది వాపోయారు. పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ నేరుగా బందోబస్తు ఏర్పాట్లు చూశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

బ్యాటింగ్ చేస్తున్న కోహ్లి

ముందుకు కదలని కలెక్టరేట్ నిర్మాణం

కలెక్టరేట్ నిర్మాణానికి తుమ్మపాలలోని ఉద్యానశాఖకు చెందిన 8.50 ఎకరాల స్థలం సముచితంగా వుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వ శాఖలన్నీ ఒకేచోట వుండేలా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ఉద్యానశాఖ స్థలం అనువుగా వుంటుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో కలెక్టరేట్ నిర్మాణం ఉద్యానశాఖ స్థలంలో జరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగింది. స్థలాన్ని స్వాధీనం చేసుకొని కొద్ది రోజుల్లో పనులు ప్రారంభిస్తారని భావించారు. అయితే ఈ స్థలం కలెక్టరేట్ నిర్మాణానికి ఇవ్వడానికి ఉద్యానశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు సుముఖత చూపలేదు. 8.50 ఎకరాల స్థలంలో దాదాపు అరెకరా స్థలంలో ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ, రైతు శిక్షణ కేంద్ర కార్యాలయాలున్నాయి. మిగిలిన స్థలంలో సపోటా, జీడి, మామిడి మొక్కలకు అంటుకట్టి రైతులకు అందజేసే ప్రక్రియ సాగుతోంది. రైతులకు అందుబాటులోవున్న ఈ కార్యాలయ సేవలు దూరమవుతాయన్న అభిప్రాయం శాఖాపరంగా వ్యక్తమవుతోంది. రహదారికి ఆనుకొనివున్న భూములను ప్రభుత్వం సేకరించి అనకాపల్లి కలెక్టరేట్ నిర్మాణం చేపట్టకుండా, ప్రభుత్వ శాఖల ఖాళీ స్థలాలు, వినియోగంలోని స్థలాలను నిర్మాణాలకు కేటాయించడం వల్ల భవిష్యత్ అవసరాలకు ప్రభుత్వ స్థలం లేకుండా పోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల రాకపోకలకు వీలుగా, రహదారికి ఆనుకొనివున్న భూములను సేకరించి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం చేపడితేగానీ కలెక్టరేట్ నిర్మాణానికి భూ సమస్య సమసిపోదని పలువురు అంటున్నారు.

జంతు సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

పొందేందుకు పలుచోట్ల పగోడాలు, విశ్రాంతి స్థలాలు ఉన్నాయి. సందర్శకులు కూర్చునేందుకు కొత్త సిటింగ్ బెంచీలు ఏర్పాటు చేశాం. వీటితో పాటు పార్కులో కొన్ని ప్రదేశాల్లో సందర్శకులు సేదతీరేందుకుగానూ పెద్ద పెద్ద అంబ్రల్లాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇవి కాకుండా క్యాంటీన్ సౌకర్యం, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటివి ఉండనే ఉన్నాయి. సందర్శకులు జూ చుట్టూ తిరిగేందుకు బ్యాటరీ వాహనాలు, ఈ–బైక్‌లు అందుబాటులో ఉన్నాయి.

కొత్త జంతువులను తీసుకు రావడానికి ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా ?

జంతు మార్పిడి విధానం ద్వారా ఇప్పటికే కొత్త జంతువులను తీసుకొచ్చాం. ఈ విధానం ద్వారా మరిన్ని జంతువులను తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జపాన్ నుంచి గెయింట్ ఆల్‌బడ్రా తాబేళ్లు, ఢిల్లీ జూ పార్కు నుంచి స్వాంప్ డీర్, హిప్పోపొటమస్, సంగటి డీర్‌లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. వరంగల్ జూ పార్కు నుంచి మౌస్ డీర్‌ను త్వరలో తీసుకురావాలని భావిస్తున్నాం. అదేవిధంగా గుజరాత్ నుంచి కూడా ఒక ఆడ సింహాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. వివిధ దేశాల నుంచి గ్రే కంగరూ, జీబ్రాలను తీసుకురాబోతున్నాం.

జూపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న చర్యలేంటి ?

వన్యప్రాణుల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల పలు కార్యక్రమాలు చేపడుతోంది. వన్యప్రాణులకు సంబంధించిన ప్రత్యేక సందర్భాల్లో విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించి వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా అవుట్ రీచ్ యాక్టివిటీలో భాగంగా జూ ఎడ్యుకేషన్ టీం ప్రతి పాఠశాలకూ వెళ్లి వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తోంది.

జూ పార్కుకు కార్పొరేట్ సంస్థలు ఏమేరకు సహకారం అందిస్తున్నాయి ?

జూ అభివృద్ధికి సిఎస్ఆర్ నిధుల ద్వారా కార్పొరేట్ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. సిఎస్ఆర్ నిధుల్లో భాగంగా ఇప్పటికే ఐఒసిఎల్ రూ.1.88 కోట్లును జూ అభివృద్ధికి అందించింది. అదేవిధంగా గంగవరం పోర్టు రూ.10 లక్షలు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ రూ.20 లక్షలు, గ్లాండ్ ఫార్మా రూ.10 లక్షలు జూ అభివృద్ధికి అందజేశాయి.

జూ ప్రవేశ ధరల పెంపు ప్రభావం సందర్శకులపై ఎలా ఉంది ?

సెంట్రల్ జూ అథారిటీ అనుమతులతోనే ఐదేళ్ల తరువాత జూ ప్రవేశ ధరలను పెంచాం. జూ పార్కులో సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు పెంచేందుకే ఉన్నత స్థాయిలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై సందర్శకుల నుంచి పాజిటివ్‌గానే స్పందన వస్తోంది.

శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం జిల్లా.
ఆర్.సి.నెం: సి3/4020/2020, తేది.17.03.2023, ఫోన్ నెం.9885054588, 9160969755

తాత్కలికబహిరంగ వేలం ప్రకటన

శ్రీ స్వామి వారి దేవస్థానం నందు తేది.24.03.2023 ఉదయం గం॥11:00లకు కొండ దిగువ దేవస్థానం కార్యాలయం నందు అనగా (తేది.01.04.2023 నుండి తేది.30.04.2023 వరకు) ఒక నెల రోజులకు ఈ క్రింది తెలిపిన వివిధ లైసెన్సు హక్కునకు తాత్కలిక బహిరంగ వేలం నిర్వహించబడును. 1) కొండపైన సన్నిధి ఫలాలు 2) భైరవస్వామి గుడి వద్ద పూజ సామాగ్రి కొబ్బరి కాయలు మరియు పూజా సామగ్రి విక్రయించుకొటకు 3) సెల్ ఫోన్స్ మరియు కెమేరాలను బద్ర పరచుకొనుటకు 4) శ్రీ స్వామి వారి కొండ దిగువ మరియు కొండ పైన ఐస్ క్రీమ్ అమ్ముకొనుటకు 5) గురువారం సంతయందు ఆశీలను వసూలు చేసుకొనుటకు 6) గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సంత యందు ఆశీలను వసూలు 7) గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద బుధవారం సంత మినహా మిగిలిన రోజులలో ఆశీలను వసూలు 8) భైరవ స్వామి వారి దేవాలయం నందు ఐస్ క్రీమ్ అమ్ముకొనుటకు 9) శ్రీ స్వామి వారి వరాహ పుష్కర్ణి వద్ద కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్ముకొనుటకు 10) పైడితల్లమ్మ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయం వద్ద కొబ్బరి ముక్కలు, చీరలు, రవికలు ప్రోగు చేసుకొనుటకు.

సం/-వి.త్రినాధరావు
కార్యనిర్వాహణాధికారి

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి – కలెక్టరేట్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని, నాణ్యమైన చదువు, వైద్యం, బతకడానికి నిత్యావసర సరుకులు అందించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మే ఆలోచనలను బిజెపి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో లక్షలాది మందితో మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ జరుగనుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలని, కేంద్ర పరిశ్రమలు, సంస్థల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను యువకులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక వర్గం మీద నిరంతరం దాడి చేస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మివేస్తున్నారని, యువకులకు ఉపాధి దొరకడం లేదని తెలిపారు. ఉపాధి లభించక దేశంలో నిరుద్యోగ శాతం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి పాలన వచ్చాక గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ చట్టం బలహీనపడిందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని దేశ ప్రజలకు హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. నేడు ఎవరికీ ఉద్యోగావకాశాలు దొరక్కపోగా ఉన్న ఉద్యోగాలనే కోల్పోవాల్సి వస్తోందన్నారు. దేశంలోనే పేరెన్నికగన్న డీజిల్ లోకో షెడ్‌లను బిజెపి పాలకులు బలహీనం చేశారన్నారు. ఉద్యోగాలు భారీగా తగ్గిపోయాయని తెలిపారు. డీజిల్ లోకోషెడ్‌ను ప్రైవేటువారికి అమ్మేయాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. విశాఖపట్నం పోర్టు, షిప్ యార్డ్‌లను బలహీన పరుస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులతో మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. ప్రతి పార్లమెంట్ సమావేశంలోనూ ఏదో ఒక పార్టీకి చెందిన ఎంపీలు కావాలనే స్టీల్‌ప్లాంట్ అంశంపై ప్రశ్న అడుగుతున్నారని, కేంద్ర మంత్రులు స్పందిస్తూ ఎలాగైనా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని చెబుతున్నారని, మారు మాట్లాడకుండా సదరు ఎంపీ కూర్చుండిపోతున్నారని తెలిపారు. మంత్రి చెప్పినదానిపై ప్రతిఘటన ఉండటం లేదు సరికదా కనీసం నిరసన కూడా తెలపడం లేదన్నారు.

బాధ్యత లేకుండా కొంత మంది పార్లమెంట్ సభ్యులు వ్యవహరిస్తున్న తీరును విశాఖపట్నం కార్మికవర్గం అసహ్యించుకుంటోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో లక్షలాది మందితో ఏప్రిల్ 5న మహా ప్రదర్శన చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీ శ్వరరావు, జిల్లా నాయకులు పి.వెంకటరెడ్డి, కెఎం.కుమార మంగళం, బి.జగన్ పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE X Addl. DISTRICT JUDGE, ANAKAPALLE
G.O.P. No.05/2023

Between:
Sri Dwarapureddi Srinivas and Anr. **...Petitioners**
And
Smt. Chinni Naga Sai and Anr. **...Respondents**

To
Respondents
1. Smt. Chinni Naga Sai,
D/o Babu Rao, Aged 28 years, Hindu, House Wife, at H.No. 4-57, Munseebdoddi, Tallapalem Village, Kasimkota, Visakhapatnam-531031, Phone No.- 7416617521.
2.Chy. Lohitaksha Madhav,
S/o Sri Dwarapureddi Srinivas, Hindu Aged 5 years, (Being minor represented by his Mother Smt.Chinni Naga Sai) Both are residing at H.No.4-57, Munseebdoddi, Tallapalem Village, Kasimkota, Visakhapatnam-531031, Aadhar No.2442 2830 7565 & Phone No.- 7416617521.

Whereas the above Petitioners have filed the above petition against 1st Respondent for the reliefs mentioned therein. Take notice that in the above proceedings you are hereby directed to appear before the **Honourable X Addl. District Judge Court, Anakapalle** on **28-03-2023 at 10.30 A.M** either in person or through an Advocate failing which the hearing will take place in your absence.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S.PRABHA,
Advocates, Visakhapatnam
Ph: 0891-2755164

ఘనంగా 'టెక్ విజన్ ఊర్జా'

వేడుకలో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విశాఖలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టెక్ విజన్ ఆధ్వర్యంలో ఊర్జా పేరిట బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్‌లో ఆదివారం తలపెట్టిన కార్యక్రమం సందడిగా సాగింది. ముఖ్య అతిథిగా ఒడిశా చీఫ్ సెక్రటరీ పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్రాంచ్ ఆపరేషన్ డైరెక్టర్ ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ సిబ్బందిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ హేమంత్ కుమార్, ఎస్ఐజి వైస్ ప్రెసిడెంట్ దాన్ తొర, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 266/2021

బిట్వీన్ : గురు గోవింద మరియొకరు ...ప్లయిన్‌టిప్స్
అండ్..
పొట్టురి నర్సింగరావు వగైరాలు...డిఫెన్‌డెంట్స్

సమను

టు,
3వ డిఫెన్‌డెంట్
పొట్టూరి నర్సింగరావు S/o క్రిష్ణమూర్తి, హిందు, రామ్మోహన్ ఏజన్సీ ప్రొప్రయిటర్, చిత్రాలయ సినిమా హాలు ఎదురుగా, విశాఖపట్నం. నివాసం డోర్.నెం. 31-333-17, డాబాగార్డెన్, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు పంపిన దావా సమన్లు, మీరు అందుకోనందున సదరు కోర్టువారు మీ హాజరు నిమిత్తం **తే.27-3-2023**దికి వాయిదా వెసియున్నారు. కావున ఆ రోజు **ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగ గాని లేక మీ తరపున లాయరు గారు గాని పై కోరులో హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు OS తీర్మానించతబడును.

J.ఆనంద్,
అడ్వకేట్,
అనకాపల్లి.

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 97/2021 IN OS 266/2021

బిట్వీన్ : గురు గోవింద మరియొకరు ...పిటీషనర్స్/ప్లయిన్‌టిప్స్
అండ్..
పొట్టురి నర్సింగరావు వగైరాలు ...రెస్పాండెంట్స్/డిఫెన్‌డెంట్స్

నోటీస్

టు,
3వ రెస్పాండెంట్/డిఫెన్‌డెంట్స్
పొట్టూరి నర్సింగరావు S/o క్రిష్ణమూర్తి, హిందు, రామ్మోహన్ ఏజన్సీ ప్రొప్రయిటర్, చిత్రాలయ సినిమా హాలు ఎదురుగా, విశాఖపట్నం. నివాసం డోర్.నెం. 31-333-17, డాబాగార్డెన్, విశాఖపట్నం.

పై నెంబరు IAలో శ్రీ కోర్టు వారు పంపిన నోటీస్‌ను మీరు అందుకోనందున సదరు కోర్టువారు మీ హాజరు నిమిత్తం **తే. 27-3-2023**దికి వాయిదా వెసియున్నారు. కావున ఆ రోజు **ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగ గాని లేక మీ తరపున లాయరు గారు గాని పై కోరులో హాజరై మీకు గల ఆక్షేపనలు తెలుపు కొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు IA తీర్మానించబడును.

J.ఆనంద్,
అడ్వకేట్,
అనకాపల్లి.

మహారాజశ్రీ రాజమండ్రి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
E.P.No. 26/2022
O.S.No. 78/2019

Between:
Batchu Bhaskara Murthy and another ***...D.H.R's***
AND
TO:
P.V.S.S.Rama Chandra Rao, S/o. Sarabha Raju, D.No. 65-5-311, Vuda Colony, Sriharipuram, MIG.IIA/AT, Visakhapatnam. ***...J.D.R***

పై నెంబరు ఇ.పి.లో జె.డి.ఆర్ అయిన మీకు Or 21 R34 of CPC నోటీసు అమలు జరుగుటకు గాను **ది.27-03-2023కి వాయిదా అయి ఉన్నది.** అందునిమిత్తమై మీకు ఏమయినా ఆక్షేపణలు ఉన్నచో వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(By Order Court)
మద్దూరి శివసుబ్బారావు
మద్దూరి శివరామశశిభూషణ్
రాజమండ్రి, 18-3-23.
అడ్వకేట్స్, రాజమండ్రి.

దుర్వాసనతో పెద్దచెరువు

చిట్టివలస చెరువులో నిల్వ ఉన్న నీరు

స్థానికులకు ఇబ్బందులు

ప్రజాశక్తి -తగరపువలస : భోరున కురిసిన వర్షంతో స్థానిక చిట్టివలస పెద్దచెరువు నుంచి దుర్వాసన ఎక్కువగా వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి డ్రెయినేజీల ద్వారా వస్తున్న మురుగు నీరు ఈ చెరువులో కలుస్తోంది. గతంతో పోల్చుకుంటే చిట్టివలస ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాలు ఇబ్బడి ముబ్బడిగా నిర్మించారు. వీటిల్లో నివాసం ఉండే వారి వాడే వాడుక నీరు ఈ చెరువులోకే చేరుతోంది. చెరువులో నిల్వ ఉన్న నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా మదుము, చప్టా ఉన్నప్పటికీ బయటకు వెళ్లేంత స్థాయికి చెరువులో నీరు చేరడం లేదు. ఏ చెరువు కైనా అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లో సక్రమంగా ఉంటే ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండే సమస్య ఉండదు. ఈ చెరువులో మురుగు నీరు చేరి నిల్వ ఉండిపోతుండటంతో దుర్వాసన విపరీతంగా వెదజల్లుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మాదిరిగా సంగివలసలో ఉన్న చెరువు ద్వారా చుట్టు పక్కల ఉన్న స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. చెరువుల్లో నిల్వ ఉన్న నీరు సక్రమ మళ్లింపునకు శాశ్వత పరిష్కారం చూపాలని జివిఎంసి అధికారులను స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - దేవరాపల్లి: దేవరాపల్లి మండల కేంద్రానికి చెందిన జామి సింహాచలంనాయుడు (28) అనే యువకుడు ఆదివారం ఉదయానికి శారదానది ఒడ్డున చెట్టుకొమ్మకు ఉరేసుకుని అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు తన కుమారుడిని . ఎవరో ఉరివేసి శారదా నది ఒడ్డున చెట్టుకొమ్మకు వేలాడదీసారని, తన బిడ్డ మృతికి కారణాలు తెలియజేయండి అంటూ ఆదివారం బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కె.కోటపాడు సిఐ ఎస్.తాతారావు, ఇంచార్జ్ ఎస్ఐ రామకృష్ణ, వెల్లడించిన వివరాలివి.

ఉరి వేసుకొని మృతిచెందిన సింహాచలం నాయుడు

ఆదివారం తెల్లవారుజామున శారదా నది ఒడ్డున బహిర్భూమికి వెళ్లిన స్థానికులకు చెట్టు కొమ్మకు ఉరేసుకుని జామి సింహాచలంనాయుడు (28) మృతి చెందిఉండడాన్ని గుర్తించారు. విషయాన్ని మృతుని తల్లి సింహాచలమ్మకు తెలియజేయగా, ఆమె పోలీసులు ఫిర్యాదు చేసింది, దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. సింహాచలం మరణ వార్త విన్న బంధువులు ఆ శారదా నది ఒడ్డుకే చేరుకొని బోరున విలపించసాగారు. మృతుడికి తల్లి, అక్క, తమ్ముడు ఉన్నారు. తండ్రి రాజునాయుడు మరణం తర్వాత సొంత ట్రాక్టర్ కొనుగోలు చేసి, కుటుంబపోషణ బాధ్యతలను సింహాచలమే చూస్తున్నాడు. కాగా యువకుని మృతికి ప్రేమ వ్యవహారమే కారణమై ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దర్యాప్తులో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జనసేన బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- మధురవాడ : నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని భీమిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల పేర్కొన్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యాన పార్టీలో చేరిన ఇఎన్ఎస్ చంద్రరావు, అక్కరమాని దివాకర్ యాదవులను ఎండాడలో ఉన్న భీమిలి కార్యాలయంలో పార్టీ కార్యకర్తలకు ఆదివారం పరిచయం చేశారు. టి.నగరపాలెంనకు చెందిన వైసిపి కార్యదర్శి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఇలిపిళ్లి నానాజి జనసేనలో చేరడంతో ఆయనకు కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, భీమిలి నియోజకవర్గంలో ఏటా క్రియాశీల సభ్యులను పెంచుతూ ఉత్తరాంధ్రలో ప్రథమస్థానం సాధించిందన్నారు. భీమిలి నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. ఇప్పటికే జనసేన పార్టీలో చేరికలు అధికంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ప్రభుత్వ వ్యతిరేకతను తెలియజేస్తుందని చెప్పారు. అనంతరం పార్టీ నాయకులు బి.వి.కృష్ణయ్య, శేఖర్ శీను బాబు, చంద్రరావు, దివాకర్ యాదవ్, పోతిన తిరుమలరావు, ఉమ్ము దేవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-విశాఖపట్నం : పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. పోతిన మల్లయ్యపాలెం క్రికెట్ స్టేడియం తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్య పనుల పట్ల అలసత్వం వహించకుండా నిర్వహించాలని, జి-20 సదస్సు నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులు, విద్యుత్తు, గ్రీనరీ, ఫుట్‌పాత్‌ల మరమత్తులతోపాటు పెయింటింగ్ ఇప్పటికే చాలా వరకు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, డిడిహెచ్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) పాపునాయుడు, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యామ్సన్‌రాజు, వినయ్‌కుమార్, డీసీపీ పద్మజ, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎన్.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి పలు సూచనలిస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

రైల్వే కాలనీల్లో డిఆర్ఎం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : డాల్ఫిన్ నోస్ కాలనీ, హార్బర్ కాలనీ, ప్రేమ్ భవన్‌లలో డిఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆదివారం పర్యటించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక సౌకర్యాలు, పారిశుధ్యం, భద్రత, రైల్వే క్వార్టర్ల పరిస్థితిని మెరుగుపరిచేందుకు డిఆర్ఎం తనిఖీలు చేపట్టారు. నివాసితులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను పరిశీలించి పలు నవరణ పనులను అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ, రైల్వే కాలనీల ఇళ్ల స్థితిగతులు, సౌకర్యాలపై ఫీడ్‌బ్యాక్, పారిశుధ్యం, భద్రత, నివాసితుల అవసరాలను తగు విధంగా పరిగణలోకి తీసుకుని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తనిఖీల ఉద్దేశమన్నారు. అన్ని కాలనీల్లో తనిఖీలు నిర్వహిస్తామని డిఆర్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజినీర్లు పి.కె.మహారాణా, సి.హెచ్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు

ఎయు విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని, వారు నవ సమాజ ప్రగతి సాధకులని ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా యూనిట్లు సంయుక్తంగా ఆదివారం ఏయూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాలులో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది సంబరాలను నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు కిరణ్ కృష్ణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. సంగీత కార్యక్రమాలతో పాటు క్లాసికల్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం జర్నలిస్టుల కుటుంబాలకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఏయూ నిర్వహిస్తున్న వివిధ కోర్సులలో విద్యార్థుల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు పనికి వచ్చే విధంగా నూతన కోర్సులను తీసుకొచ్చామని చెప్పారు. ఎయు అభివృద్ధిలో మీడియా సహకారం ఎంతో అవసరమన్నారు.

జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, సమాజ చైతన్యానికి జర్నలిస్టులు నాంది అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విజయవంతంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారిధిగా ఉంటూ సమస్యలను వెలుగులోకి తెస్తూ, పరిష్కారం చూపుతూ చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఏపీడబ్ల్యూజెఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, ఎ.సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎన్.రామకృష్ణ, కె.మురళీకృష్ణ, రంగాధామం, బొప్పన రమేష్, కోశాధికారి బి.సీతారామమూర్తి, సంయుక్త కార్యదర్శులు పి.కామన్న, ఇజ్రాయిల్, రమణమ్మ, ఎంవి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు.

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న విసి ప్రసాదరెడ్డి తదితరులు

దీక్షలో కూర్చున్న షిప్‌యార్డు ఐఎన్‌టియుసి నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రకటనతో..

బిజెపి పతనం ప్రారంభం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిన రోజు నుంచే ఇక్కడ ఆ పార్టీ పతనం ప్రారంభమైందని షిప్‌యార్డ్ ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి పి.శ్రీరామ్మూర్తి ఆరోపించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కకుండా ఓడించేందుకు కారణం ఇదే అన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 715వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో షిప్‌యార్డ్ ఐఎన్ టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ, ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షల్లో ఐఎన్‌టియుసి షిప్‌యార్డు ఉపాధ్యక్షుడు ఎ.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

వైజాగ్ రన్నర్స్ సొసైటీ వాక్‌థాన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యాన దివీస్ లేబొరేటరీస్ సౌజన్యంతో అంధ విద్యార్థులకు నగరంలోని ఆర్‌కె.బీచ్‌లో ఆదివారం ఉదయం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ వాక్‌థాన్‌ను సిఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారికి విద్యపై అవగాహన కల్పించి 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై అవగాహన కల్పించటం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వైజాగ్ రనర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బలకృష్ణారాయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ లేబొరేటరీస్ ప్రతినిధి ఎల్‌వి.రమణ, వైఎస్.కోటేశ్వరరావు, విజయనగరం, విశాఖపట్నం అంధుల పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ మహేశ్వరరెడ్డి, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల చైర్మన్ వాసు ప్రకాష్, నోవాటెల్ హోటల్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ప్రతినిధులు, వైజాగ్ రనర్స్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ భరత్, సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ రాధిక, జాయింట్ ట్రెజరర్ రాణా, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

జాతీయ సమైక్యత శిబిరానికి ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు తరలివెళ్లారు. డాక్టర్ విఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రోగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఎయు ఎన్‌ఎస్-ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వీరిని వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం

ప్రథమ వర్ధంతి సభలో వక్తలు

మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి-యంత్రాంగం

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం అని వక్తలు కొనియాడారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల ఆమె ప్రథమ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.

గాజువాక : జీవీఎంసీ 70వ వార్డు పరిధి దశమకొండలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, పి.నర్సింగరావు, మహిళా సంఘం నాయకులు పి.మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో స్వరాజ్యం చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గెరిల్లా యుద్ధం చేసిన వీర నారీ, పోరాటాల ప్రవాహం మల్లు స్వరాజ్యం అన్నారు. వందలాది పల్లెల విముక్తి పోరాటంలో అగ్రభాగాన నిలిచిన ధీరురాలు అని కొనియాడారు. నిజాం ప్రభుత్వాన్ని, పోలీసు బలగాన్ని ముప్పతిప్పలు పెట్టించారని తెలిపారు. మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మనమంతా నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

59వ వార్డు పరిధి నెహ్రూనగర్‌లో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, 62వ వార్డు దుర్గానగర్‌లో జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, 63వ వార్డు చింతల్లోవలో సిపిఎం నాయకులు కె.పెంటారావు తదితరులు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో గంటా సత్యనారాయణ, వై.లక్ష్మణరావు, వాసు, నరేష్, సత్తిబాబు, వై.గంగాధర్, బి.రాంబాబు, జె.రామునాయుడు, విమల, ఊర్వశమ్మ, రాజు, రాజేష్, హరి, రాజు, రామారావు పాల్గొన్నారు.

మధురవాడ : కొమ్మాది సిఐటియు కార్యాలయంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జోన్ ప్రధాన కార్యదర్శి బి.భారతి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, బ్రిటిష్ కాలంలో నిజాం నవాబుల పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, భానిసత్వ విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో నాయకత్వం వహించిన గొప్ప ధైర్యశాని స్వరాజ్యం అని కొనియాడారు. తుపాకీ పట్టి బ్రిటీష్ సైన్యంతో పోరాడారని గుర్తుచేశారు. మహిళలను చైతన్య వంతులను చేసి, శిక్షణ ఇచ్చి అనేక దళాలను తయారుచేసి యుద్ధంచేశారని తెలిపారు. స్వరాజ్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి తరం యువత ప్రజా,కార్మిక పోరాటాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు డి.అప్పలరాజు, డి.కొండమ్మ, జి.కిరణ్, టి.గోవిందు, యువజన సంఘం నాయకులు బి.ఉష, డి.శైలి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : తెలంగాణ నిజాం అరాచక పాలనకు వ్యతిరేకంగా, భూస్వాముల దాష్టీకాన్ని ఎదిరించిన ధీరోవనిత మల్లు స్వరాజ్యం అని ప్రజా సంఘాల ప్రతినిధులు కొనియాడారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో రైతులు రైతు కూలీల తరపున పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని భూస్వాముల కబంధ హస్తాల నుంచి విడిపించి పేదలకు అప్పగించిన ఘన చరిత్ర మల్లు స్వరాజ్యాన్నిదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు సారధ్యంలో సాహితీ పోరాటంలో స్వరాజ్యం అద్వితీయ పాత్ర పోషించారన్నారు. సాయుధ పోరాట ఫలితంగా నైజాం ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో విలీనం అయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శం కావాలన్నారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ బాలకష్ణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి, ఎస్ఎఫ్ఐ నాయకులు రమణ, ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి సిపిఎం జిల్లా కమిటి సభ్యులు జి. దేముడునాయుడు, మండల నాయకులు. పూల మాల వేసి, నివాళులర్పించారు. మల్లు స్వరాజ్యం ఆశయసాధనకోసం నిరంతరం పనిచెయ్యడమే. ఆమెకు మనమిచ్చే నిజమైన నివాళి అని సంతాపం ప్రకటించి. ప్రతిజ్ఞ చేసారు. కార్య క్రమంలో సిపిఎం నేతలు సిహెచ్. గంగరాజు, జి. లక్ష్మి. రాము, ప్రజా సంఘాల నేతలు శివాజీ, కాశయ్య, పెంటమ్మ, రాము పాల్గొన్నారు.

కె. కోటపాడు: స్థానిక సిఐటియు కార్యాలయంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్ర దేవుడు. వనమ సూర్యనారాయణ రంగలి తాతబాబు మొదలగురు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు. నాటి దొరల దురహంకారం, నిజాం నిరంకుశపాలన, మద్యపాన నిషేధానికి, పేదలకు భూహక్కు కల్పనకు స్వరాజ్యం చేసిన పోరాటాలను కొనియాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలిగా, చైతన్య మానవి త్రైమాసిక పత్రికలో పత్రిక సంపాదక వర్గంలో సభ్యురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, ఆర్.అమ్మాజీ, వరలక్ష్మి, సత్యవతి, వడిశెట్టి లక్ష్మి, సి.ఐ.టి.యు .జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవాడ: పరవాడ సంతబయలు వద్ద మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ తెలంగాణలో నిజాం అరాచక పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాట సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన కామ్రేడ్స్ సుందరయ్య చంద్ర రాజేశ్వరరావు సారధ్యంలో జరిగిన సాహితి పోరాటంలో మల్లు స్వరాజ్యం నిర్వహించిన పాత్ర అమోఘమన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం, సిఐటియు నాయకులు ఎస్ వెంకటలక్ష్మి, సిహెచ్ దేవుడమ్మ, పి అప్పలనాయుడు, బి రమేష్ పాల్గొన్నారు.

కొమ్మాది సిఐటియు కార్యాలయంలో ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

గాజువాకలో...

పరవాడ సంతబయలులో...

కశింకోటలో...

కె.కోటపాడు సిఐటియు కార్యాలయంలో...

రాంబిల్లిలో...

అనకాపల్లిలో మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

పలుచోట్ల అంగన్‌వాడీల గృహ నిర్బంధం

'చలో విజయవాడ' భగ్నానికి ప్రభుత్వ యత్నం

అంగన్‌వాడీలకు ఫేస్‌యాప్ రద్దు చేయాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ సరఫరా ప్రభుత్వమే చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న పిలుపునిచ్చిన చలో విజయవాడ ఆందోళనకు వెళ్లకుండా యూనియన్ నేతలను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. గృహనిర్బంధం, ముందస్తు అరెస్టులతో ఆందోళన భగ్నం చేసే చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి- చోడవరం : అంగన్వాడీ సమస్యలపై ఈనెల 20న చలో అమరావతికి సిద్ధమవుతున్న వామపక్షాల, ప్రజాసంఘాల నాయకులను ఆదివారం చోడవరం పోలీసులు గహనిర్బంధం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు జీ వరలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాలను పోలీసులు గహ నిర్బంధించారు.

బుచ్చయ్యపేట: అంగన్వాడీల చలో విజయవాడ ఆందోళన నేపథ్యంలో అంగన్వాడీ యూనియన్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆది వరలక్ష్మి, ఎలిశెట్టి అమ్మాజీలను బుచ్చయ్యపేట పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆందోళనకు వెళ్లకుండా అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షరాలు ఆది వరలక్ష్మిని కొన్నెంపూడి లోను, ఎలిశెట్టి అమ్మాజీని వడ్డాది లోను ముందస్తుగా గృహనిర్బంధం చేశారు.

వడ్డాది :చలో విజయవాడ ఆందోళనకు వెళ్లకుండా అంగన్వాడీ యూనియన్‌నేత గనిశెట్టి అమ్మాజీని వడ్డాదిలో ఆమె స్వగృహంలో పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, తమను అరెస్ట్ చేసినంతమాత్రాన ఉద్యమం ఆగదని, సుప్రీంకోర్టు తీర్పుమేరకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పరవాడ: ఈనెల 20న చలో విజయవాడ ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సిఐటియు నేతలను ముందస్తు గృహనిర్బంధం చేశారు.. 79వ వార్డు సిఐటియుకార్యదర్శి దేశపత్రిపాలెం మాజీ ఉప సర్పంచ్. వివి రమణను దేశపాత్రునిపాలెంలోను, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు సిహెచ్ దేవిని గొర్లివానిపాలెంలో పోలీసులు గృహనిర్బంధం చేశారు.

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యమాలపై అణిచివేత చర్యలు మానుకోవాలని అక్రమ అరెస్ట్ దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు.. అక్రమ అరెస్టులను ఆపకపోతే భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని గని శెట్టి హెచ్చరించారు

దేశపాత్రునిపాలెంలో గృహనిర్బంధంలో సిఐటియు నేత రమణ

బుచ్చెయ్యపేట, పరవాడ, వడ్డాదిల్లో గృహ నిర్బంధంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు

'చలో ఢిల్లీ'కి తరలిరండి



మాట్లాడుతున్న రైతు సంఘం నేత నాయిని బాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు : వచ్చేనెల ఐదో తేదీన ఢిల్లీలో జరుగు కార్మిక కర్షక సమావేశానికి రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినిబాబు కోరారు. ఆదివారం మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసే వరకు కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. మోడీ ప్రభుత్వం దేశ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తోందని విమర్శించారు. మరొకపక్క ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతూ, కార్మికుల పొట్టను కొడుతుందన్నారు కార్మిక, కర్షకుల హక్కుల సాధనకు చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులందరూ తరలిరావాలన్నారు. ఎపి రైతు సంఘం సుగర్ ఫ్యాక్టరీ కార్యదర్శి వనము సూర్యనారాయణ, ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, రొంగలి తాతబాబు. ఎన్ శ్రీను, మోహనరావు, సన్యాసినాయుడు, రామ నాయుడు పాల్గొన్నారు.

జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 40,164 మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన నిధులు ఆదివారం విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి అజయ్‌బాబు విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులకు సంబంధించి రూ.23.89 కోట్ల విద్యాదీవెన నిధులు విడుదల అయ్యాయన్నారు. వీరిలో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ కింద 36,474 మంది విద్యార్థులకు ఇరవై ఒక్క కోట్ల ఏడు లక్షలు, సాంఘిక సంక్షేమ శాఖ కింద 2,940 మందికి రెండు కోట్ల 46 లక్షలు, గిరిజన సంక్షేమ శాఖ కింద 498 మంది విద్యార్థులకు రూ.20.64 లక్షలు, ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ కింద 252 మంది విద్యార్థులకు రూ.15.83 లక్షలు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జామ చేస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ఎఎస్‌డబ్ల్యూఒ సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా దీవెన చెక్కు ఇస్తున్న అజయ్‌బాబు

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నునపర్తి క్రీడాకారుల ఎంపిక

జాతీయ పోటీలకు ఎంపికైన రాధా స్రవంతి, హిమబిందు, హైమావతి

ప్రజాశక్తి అచ్యుతాపురం: జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ఎంరాధాస్రవంతి, వై హిమబిందు, జె.హైమావతి ఎంపికైనట్లు మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు, గౌరవ అధ్యక్షులు పెదపూడి శంకరరావు తెలిపారు. ఈనెల 17, 18, 19 తేదీలలో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పోటీలలో విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి, వీరు క్రీడా ప్రతిభను చూపించారు. ఈ పోటీల్లో ప్రతిభ ఆధారంగా ఎం.రాధా స్రవంతి, వై హిమబిందులకు స్టార్ ఆఫ్ ఆంధ్ర బెస్ట్ ప్లేయర్ అవార్డు లభించిందన్నారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే అండర్-19 జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. జాతీయ పోటీలకు నునపర్తి క్రీడాకారులు ఎంపికపై మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు, గౌరవాధ్యక్షులు పెదపూడి శంకరరావు, కార్యదర్శి మాసవరపు అప్పారావు అభినందనలు తెలిపారు.

2024 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

టిడిపి విజయోత్సవ ర్యాలీలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద విక్టరీ సంకేతమిస్తున్న బండారు, నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : 2024 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి టిడిపి క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపికి చెందిన వేపాడ చిరంజీవిరావు విజయం సాధించిన సందర్భంగా ఆదివారం టిడిపి కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా చిరంజీవిరావును అభినందించారు. అనంతరం జిల్లా కార్యాలయం నుంచి పంది మెట్ట మీదగా బీచ్ రోడ్‌లో ఉన్న ఎన్‌టి.రామారావు విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల స్ఫూర్తితో కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన చిరంజీవిరావు మాట్లాడుతూ, 34 నియోజకవర్గాల ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపునకు కృషిచేసిన ఉత్తరాంధ్ర జిల్లాల టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసి మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రులు కొండ్రు మురళీమోహన్, కిడారి శ్రావణ్ కుమార్, ఎస్ కోట, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, పీలా గోవింద సత్యనారాయణ, విశాఖ దక్షిణ, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు గండి బాబ్జి, కోరాడ రాజబాబు, నాయకులు చిక్కాల విజయ్‌బాబు, పాశర్ల ప్రసాద్, బుద్ధ నాగజగదీశ్వరరావు, ద్వారపురెడ్డి జగదీష్, ప్రగడ నాగేశ్వరరావు, పివిజి.కుమార్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, వలిశెట్టి తాతాజీ, కిమిడి మల్లిక్‌నాయుడు, బంగారయ్య, బొండ జగన్, పైల ప్రసాద్, గంధం శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు, గొలగాని వీరరావ్, విల్లూరి చక్రవర్తి, తోట రత్నం, మల్ల సురేంద్ర, కోయిలాడ వెంకటేష్, అబ్దుల్ చిన రెహమాన్, ఈతలపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిరావుకు గాజువాక నాయకుల అభినందనలు

గాజువాక : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన చిరంజీవిరావును తెలుగుదేశం పార్టీ గాజువాక నాయకులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో గాజువాక టిడిపి కార్యకర్తలు తన విజయానికి మంచి కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్, 78వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.రతన్‌కాంత్, 64, 65, 87 వార్డుల అధ్యక్షులు హరికృష్ణ, రట్టి వాసు, బెల్లంకొండ రాజన్నరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి కల్లేపల్లి శ్రీనివాస్‌వర్మ పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపు నేపథ్యంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. వు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లేటి కరుణాకరరావు (మహేశ్వరినాయుడు) ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె దేముళ్ల అధ్యక్షతన గెలుపు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రొంగలి గోవిందమ్మ, జాన దేముడమ్మ, కాటపల్లి సన్యాసిరావు, కొల్లి బాలకష్ణ, గవిరెడ్డి దేముళ్ళు, నానాజీ, చిటికిరెడ్డి కొండబాబు పాల్గొన్నారు.

గాజువాకలో చిరంజీవిరావును అభినందిస్తున్న పల్లా



దేవరాపల్లిలో కేక్ తినిపిస్తున్న టిడిపి నేతలు

21న పిఎం ఉపాధి కల్పనపై సదస్సు

ప్రజాశక్తి-.అనకాపల్లి : ఈనెల 21న ప్రధానమంత్రి ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఖాదీ,గ్రామీణ పరిశ్రమల మండలి జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ వి.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ అవగాహన సదస్సుకు పరిశ్రమలు స్థాపించేందుకు ఆసక్తి గల నిరుద్యోగ యువత హాజరై పథకానికి సంబంధించిన వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ సదస్సుకు జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు, ఖాదీ కమిషన్ అధికారులు హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాణిజ్య వివాదాల పరిష్కారంలో కోర్టుల పాత్ర కీలకం

జాతీయ సదస్సులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి

జస్టిస్ శేషసాయిని సత్కరిస్తున్న లా వర్సిటీ విసి సూర్యప్రకాష్

ప్రజాశక్తి- సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో భారతదేశంలో వ్యాపార ర్యాంకింగ్‌ను మెరుగుపరచడంలో వాణిజ్య న్యాయస్థానాల పాత్ర అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్. సూర్యప్రకాష్ తెలిపారు. ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి.శేషసాయి ముఖ్య అతిథిగా. భారత ప్రభుత్వం న్యాయ శాఖ జాయింట్ సెక్రటరీ నీరాజ్ కుమార్ గయాగి, మాజీ జాయింట్ సెక్రటరీ రాఘవేందర్‌లు సదస్సుకు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. .ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ డిఎస్ఎన్ఎల్‌యూ లోని యువ విద్యార్థులు ముందు న్యాయవాదులుగా ట్రయల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేసి, చట్టంపై ప్రత్యక్ష అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే సీనియర్లను గౌరవించి, వారి అపార అనుభవం నుంచి నేర్చుకోవాలని సూచించారు. వ్యాపారాలు, పర్యావరణ వ్యవస్థలకు సంబంధించిన కాంట్రాక్టు అమలు, వివాద పరిష్కార ప్రక్రియలను అత్యవసరంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా అన్ని వివాదాలు, అప్పీళ్ల విచారణ వేగవంతమై, గరిష్టంగా ఏడాదిలోపు పరిష్కరించబడుతుందన్నారు. వర్సిటీ విసి డాక్టర్ ఎస్. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ కమర్షియల్ కోర్టుల చట్టం, 2015, కమర్షియల్ కోర్టు సవరణ చట్టం, 2018, నిర్దిష్ట సవరణ చట్టం, 2018 అమలులోకి రావడం వల్ల భారత దేశం అంతర్జాతీయంగా ఉత్తమ విధానాలకు అందిపుచ్చుకున్న దేశంగా తయారైందన్నారు. అన్ని స్థాయిలలో జాతీయ, అంతర్జాతీయ వాణిజ్యాలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించబడిందన్నారు. తద్వారా భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ మంది అంతర్జాతీయ పెట్టుబడిదారులు ముందుకు వస్తారన్నారు. జాతీయ,అంతర్జాతీయ కాంట్రాక్ట్ అమలు వ్యవస్థకు సంబంధించిన సమస్యలు,సవాళ్ళు, వాణిజ్య వివాదాలలో ప్రభుత్వ వ్యాజ్యాల యొక్క ఇ-ఫైలింగ్ తప్పనిసరి అమలు స్థితి, దక్షిణ ప్రాంతంలో వాణిజ్య న్యాయస్థానాల తీర్పుల సారాంశం, జారీ చేసిన డిక్రీల అమలుకు సంబంధించిన సమస్యలు, గణాంకాల సేకరణ, తదితర అంశాలను కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న న్యాయ నిపుణులు కూలంకషంగా చర్చించారు కార్యక్రమంలో డాక్టర్ కె. పట్టాభి రామారావు, (జడ్జి, ప్రిన్సిపల్ స్పెషల్ కమర్షియల్ కోర్ట్, హైదరాబాద్,) తిరు జె.సెల్వనాధన్,(చీఫ్ జడ్జి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్ట్, పుదుచ్చేరి,) రాధా, (అడిషనల్ సిటీ సివిల్ మరియు సెషన్స్ జడ్జి, బెంగళూరు,)ఎం. రామ్‌దాస్ (సీనియర్ న్యాయవాది, విశాఖపట్నం), ఎ.సత్య ప్రసాద్. (ఆంధ్రప్రదేశ్ మాజీ అడ్వకేట్ జనరల్), కృష్ణకుమార్ వెంకట కంచర్ల, (డైరెక్టర్, కె. రామబ్రహ్మం అండ్ సన్స్, విశాఖపట్నం) న్యాయ విభాగం,ఉక్కు కర్మాగారం సదస్సుకు ప్యానెలిస్ట్‌గా హెడ్‌జి వి శ్రీహరి పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
నాగేశ్వరరావు, అంబేద్కర్

దాసరి నాగేశ్వరరావు, టిఆర్. అంబేద్కర్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో సంఘం జిల్లా కౌన్సిల్ జరిగింది. దీనిలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, ఎన్నికల పరిశీలకులుగా మరో రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి వ్యవహరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎ.పైడిరాజు, జిల్లా అధ్యక్షులుగా దాసరి నాగేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా రొంగలి ఉమాదేవి, ఎం.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టిఆర్.అంబేద్కర్, కోశాధికారిగా కొత్తపల్లి రాంబాబు, కార్యదర్శులుగా ఎ.సత్యకళ, ఉప్పాడ రాము, చుక్కా సత్యం, సామా రాజులు, రియాజ్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.రవిబాబు, రాష్ట్ర కౌన్సిలర్లుగా తాడాన అప్పారావు, వి.రామలక్ష్మి ఎన్నికయ్యారు.

జగన్‌ను నమ్మని ఉత్తరాంధ్ర ప్రజలు

మాట్లాడుతున్న గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి.-అనకాపల్లి : ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని నమ్మలేదని ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా విద్యావంతుల మనోభావాలు వెల్లడించారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక గవరపాలెం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్లో ఉత్తరాంధ్రకు అన్యాయం చేశారని, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చిన్న చూపు చూశారని బడ్జెట్ ద్వారా స్పష్టం అవుతుందన్నారు. గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌ను విశాఖ ప్రజలు ఒక నాటకంగా భావించారన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై మంత్రులు ఏ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వైసిపి గాలికి వచ్చిన పార్టీ అని, వచ్చే ఎన్నికలకు గాలిలోనే కలిసిపోతుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సురేంద్ర, నీల బాబు, ఉగ్గిన రమణ మూర్తి, కొణతాల రత్నకుమారి, బి ఎస్ ఎం కె జోగినాయుడు, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబీ, పోలవరపు త్రినాథ్, ఆళ్ల రామచంద్రరావు, శంకర్ల పద్మలత పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌కు సత్కారం

ప్రజాశక్తి -చింతూరు : ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ సేవలను గుర్తించి ఎటపాక మండలంలోని ఆయుర్వేద ఆసుపత్రి వద్ద ఆదివారం హైదరాబాదుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోటేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులు, సుగర్, బీపీలతో బాధపడుతున్న తనతోపాటు ప్రమాదవశాత్తు కింద పడటంతో వెన్నెముకకు గాయమై నడవలేని స్థితిలో ఉన్న తన భార్యకు ఆయుర్వేద వైద్యం అందించి నయం చేసిన డాక్టర్ జమాల్‌ఖాన్‌కు రుణపడి ఉంటామని పేర్కొంటూ సత్కరించారు. సోషల్‌మీడియా ద్వారా డాక్టర్ జమాల్‌ఖాన్ గురించి తెలుసుకుని, హైదరాబాద్ నుంచి వచ్చి వైద్యం పొందామని, ఇపుడు పూర్తిగా స్వస్థత చేకూరిందని కోటేశ్వరరెడ్డి వెల్లడించారు. తమలాగా మరెందరో అనేక వ్యాధులతో సమస్యలతో బాధపడుతున్నారని వారిని కూడా ఆయుర్వేద వైద్యం ద్వారా తగ్గించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకొన్నారు.

నూకాంబిక జాతరకు ఏర్పాట్లు పూర్తి

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ప్రజాశక్తి -అనకాపల్లి : కొత్త అమావాస్య సందర్భంగా నూకాంబిక నెల పండుగ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. నూకాంబిక కొత్త అమావాస్య సందర్భంగా నెలరోజుల జాతర ఈ నెల 20న ప్రారంభమై, 21వ తేదీన కొత్త అమావాస్య పండగ, 22వ తేదీ ఉగాది పర్వదినం, వచ్చేనెల 19న నెల పండుగ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కులు ముడుపులు తీర్చుకుంటారు. ఈనెల 20న జాతర ప్రారంభం సందర్భంగా పలు సాంస్కృతిక, పౌరాణిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేశారు. ఆదివారం ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో సహాయ కమిషనర్ చంద్రశేఖర్, వైసిపి యువజన విభాగం నాయకులు దాడి జైవీర్ ఉత్సవ ఏర్పాట్లపై వివరించారు. . ఉత్సవం సందర్భంగా నెలరోజుల పాటు భక్తులకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు శీతల పానీయాలు మజ్జిగ పంపిణీ చేస్తారన్నారు. ఆలయం వద్ద ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేసేందుకు తగిన సిబ్బందిని నియమించారని, పటిష్ట పోలీసు సిబ్బంది, భక్తులకు ఇబ్బంది కలగకుండా శాశ్వత ఏటిఎం, తాత్కాలిక మరుగుదొడ్లు, చిన్న పిల్లలకు ఫీడింగ్ ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రపంచానికి చాటి చెప్పేలా అందరూ కృషి చేయాలని కోరారు. నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రతిష్ట దేశ నలుమూలలు ప్రచారం కావడంతో అనేక రాష్ట్రాల్లో నూకాంబిక అమ్మవారిని కొలవడం గర్వకారణంగా ఉందన్నారు.

ఘనంగా అన్నమాచార్య వర్ధంతి

అన్నమాచార్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి సత్యవతి

ప్రజాశక్తి- అనకాపల్లి : పద కవిత పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 520వ వర్ధంతి ఆదివారం అన్నమాచార్య వాగ్గేయ వరదాయని సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యనారాయణ దేవస్థానం కొండపై జరిగిన మెట్లోత్సవం 2023 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి విష్ణుమూర్తి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమాచార్య వర్ధంతిని అనకాపల్లిలో ప్రథమంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. అనంతరం అన్నమాచార్య వాగ్గేయ వరదాయని సంస్థ వారిచే సప్తగిరి సంకీర్తన గోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కాంగ్రేగుల అరుణ కుసుమంచి పద్మ, బి.కుమారి, తిమ్మాపురం లక్ష్మి, సకల గోవిందరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో నాని 'దసరా' సందడి

మాట్లాడుతున్న సినీ హీరో నాని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దసరా సినిమా కుటుంబ సమేతంగా చూడదగ్గదని హీరో నాని పేర్కొన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హీరోయిన్ కీర్తి సురేష్‌తో తాను నేను లోకల్ సినిమా తరువాత చేసిన రెండో చిత్రం ఇదని తెలిపారు. ఈ సినిమా ఈ నెల 30వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతుందన్నారు. ఆ రోజు నుంచి ఒక పుష్ప, ఒక కెజిఎఫ్ -2 మాదిరిగానే దసరా సినిమా గురించి మాట్లాడతారన్నారు. సినిమాలో అంత బలమైన, నమ్మకమైన కంటెంట్ ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ సినిమా బాగా తీశారన్నారు. పాటలకు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. సంతోష్ నారాయణ మంచి సంగీతం అందించారన్నారు. ఈ సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులనూ అలరిస్తుందని తెలిపారు. మీడియా సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖకు విద్యుత్ బస్సులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలోకి విద్యుత్ బస్సులు రానున్నాయి. ఆరు మాసాలలో ఇవి రోడ్లపై పరుగులు తీయనున్నాయి. ప్రజా రవాణా విభాగం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎలక్ట్రిక్ (విద్యుత్) బస్సులను తిప్పేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా విశాఖ నగరానికి వంద విద్యుత్ బస్సులు కేటాయించే అవకాశం ఉందని ఆర్‌టిసి ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విశాఖకు వంద ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని ఈసరికే ప్రతిపాదనలు పంపామని, ఈ-బస్సులకు లైన్ క్లియర్ కావడంతో తొలివిడతలో 50, మలి దశలో మరో 50 వెరసి 100 బస్సులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యుత్ బస్సులు ఎయిర్ కండిషన్ సదుపాయాన్ని కలిగి ఉంటాయని, బ్యాటరీ సాయంతో నడవనున్నందున ఇవి దూర ప్రాంతాలకు అనువుగా ఉండవని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వీటిని నగరంలో ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలకు సిటీ సర్వీసులుగానే నడపనున్నట్టు తెలుస్తోంది. విశాఖపట్నం జిల్లాకు విద్యుత్ బస్సులతో పాటు మరో వంద వరకూ కొత్త డీజిల్ బస్సులు రానున్నాయని తెలిసింది. అంతా సజావుగా సాగితే ఆర్‌టిసిలో 13 లక్షల కిలోమీటర్లు తిరిగినా లేదా 15 ఏళ్ల పూర్తయిన బస్సులను తొలగిస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెడతారు. మరికొన్ని బస్సులను 9-10 లక్షల కిలోమీటర్లు తిరిగాక పల్లె వెలుగు సర్వీసులుగా బాడీని మార్పు చేసి నడుపుతారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 15 ఏళ్ల పూర్తి చేసుకున్న బస్సులు 35 వరకూ ఉన్నాయి. త్వరలోనే వాటిని నిలిపివేయనున్నారు.

అధికార పార్టీలో అంతర్మథనం

◆ముమ్మరంగా ప్రచారం చేసినా కానరాని ఫలితం

◆వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి ఓటమితో డీలా పడ్డ నేతలు

◆రాజకీయ భవితవ్యంపై ఆందోళన

ప్రజాశక్తి-రావికమతం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి వ్యతిరేకంగా వెలువడటంతో అధికార పార్టీకి చెందిన నాయకులు బయటకు గాంభీరం ఉన్నా లోలోన అంతర్మథనం మొదలైంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కాలం మాత్రమే ఉండటంతో ఎమ్మెల్సీ ఓటమి తమ భవిష్యత్తును ఎటువైపు మళ్లిస్తుందోనని ఆలోచనలో మునిగిపోయారు. ఉత్తరాంధ్రలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకున్నారు. 2019 ఎన్నికలలో వ్యక్తిగత గెలుపు కోసం పడిన శ్రమకు మించి అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించేందుకు చోడవరం నియోజకవర్గంలో నేతలు ఎంతగానో శ్రమించారు. పట్టభద్రుల ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు రెండు నెలల ముందు నుంచి నియోజకవర్గంలోని చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలలో స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీతో పాటు ఈ నియోజకవర్గానికి ఇన్చార్జిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్సీ కోలా గురువులు, నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు సర్పంచులు, ఎంపిటిసీలు, వైస్ ఎంపీపీలతో పాటు మండల పార్టీ నాయకులు, అధ్యక్షులు అలాగే నూతనంగా నియమించిన ఎమ్మెల్యే ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, మండల కోఆర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లు, గృహసారథులు వీరంతా ప్రచారం చేపట్టారు. గ్రామాల వారీగా పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించారు. ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు తరచూ గ్రామాల వారీగా కోఆర్డినేటర్లు కోఆర్డినేట్ చేస్తూ పనిచేశారు. దీనిలో భాగంగా పరిపాలన రాజధాని విశాఖకు తరలింపుపై నిరుద్యోగులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. లక్షల కోట్లతో ఉత్తరాంధ్రలో పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తామంటూ ప్రచారంలో గట్టిగా తమ వాణిని వినిపించారు.రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఈ ఎన్నిక ఫలితం దిక్సూచి వంటిదని బలంగా నమ్మడంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్వయంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ పాల్గొన్నారు. కుల సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, పాల ఉత్పత్తిదారుల సంఘాలు, స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు గృహసారథలతో ఊపిరి సలపని స్థాయిలో సమావేశాలు నిర్వహించారు.పట్టభద్రులను వ్యక్తిగతంగా కలుసుకున్నారు. మరొకవైపు గడపగడపకు ప్రభుత్వం పేరిట ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో వ్యక్తిగతంగా లబ్ధి పొందిన వివరాలను ఎమ్మెల్యే స్వయంగా వివరించారు.

నియోజకవర్గంలో పలుమార్లు వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కూడా మండలంలో పలు సమావేశాలలో పాల్గొన్నారు. రావికమతం మండలంలో సుమారు 15 సమావేశాలకు పైగా ఏర్పాటు చేశారు. అలాగే అత్యధిక ఓటర్లుగా నమోదైన మేడివాడ, టి.అర్జాపురం, కొత్తకోట, దొండపూడి, తోటకూరపాలెం, చిన్నపాచిల, రావికమతం ,తదితర గ్రామాలలో పట్టభద్రులను కన్వీనర్ల ద్వారా ఆయా గ్రామాలలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. పాల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులను కూడా ఇందులో భాగస్వాములను చేసినప్పటికీ కనీసం ఫలితం లేకపోయింది.

ఇదేవిధంగా నాలుగు మండలాల్లో తరచు అనేక సమావేశాలు ఏర్పాటు చేసి ఓట్లు చేర్పించిన దగ్గర నుంచి ఓటు వేయించే వరకు అనేక రకాలుగా నిరంతరం కృషి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో అధికార పార్టీ మండల స్థాయి, గ్రామస్థాయి నాయకత్వం డీలా పడింది.

ఇదిలా ఉండగా చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు ఉద్యోగిగా అనేక రకాలుగా యువకులతో పలు పరిచయాలు ఉఉన్నాయి. పలు కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, కాపు కమ్యూనిటీకి చెందిన వ్యక్తి కావడం ఆయనకు కలిసి వచ్చినట్లు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా నాయకులు, కార్యకర్తలను పట్టించుకోక పోవడంతో పలు గ్రామాల్లో ప్రచారం నిస్తేజంగా సాగింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు తప్ప అభివృద్ధి పథకాలు , గ్రామపంచాయతీల అభివృద్ధి, లేకపోవడంతో పలు గ్రామాల్లో పార్టీ నాయకులను పక్కన పెట్టి పాలన సాగించడం, కనీస గౌరవం కూడా వారికి లేకపోవడం, నేరుగా ముఖ్యమంత్రి ప్రజలకు నేరుగా బటన్ నొక్కి పథకాలు అందజేయడంతో అధికార పార్టీ నాయకులు అందరూ అసంతృప్తితో ఉన్నారు. ఏది ఏమైనా ఈ పరిస్థితి అధికార పార్టీ నాయకుల్లో బయటకు కనిపించని తీవ్ర నిరాశ నిస్పృహ నెలకొంది.

దగ్ధమైన సామగ్రిని పరిశీలిస్తున్న గ్రామస్తులు

గృహోపకరణాలు దగ్ధం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో గుమ్మాలపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో ప్రమాదం వాటిల్లింది. గుమ్మాలపాడు గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు ఇంట్లో హీటర్ స్విచ్ ఆన్ చేసి వది లేయడంతో ఇల్లంతా పొగలు కమ్మాయి. దీంతో మిక్సీ, గ్రైండర్ పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో పెనుముప్పు తప్పింది. ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది మాట్లాడుతూ, ఇంట్లో వాడుతున్న వంటగ్యాస్, కుక్కరు, హీటరు, గ్రైండర్, ఎలక్ట్రికల్ పరికరాలు ఉపయోగంపై తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు, చెత్తా చెదారం

రోడ్లపై మురుగునీరు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణం తడిసి ముద్దయ్యింది. డ్రైనేజీ కాలవుల్లో నీరు రోడ్లపై పొంగి పొర్లుతుంది. చెత్త చెదారంతో రోడ్లు అధ్వాన్నంగా మారాయి.స్థానిక శారద నగర్, కొత్త వీధి, పెద్దబొడ్డేపల్లి థెరిసా కాలనీ, తదితర ప్రాంతాల్లో సిసి రోడ్లపై మురుగు నీటి కాలువల్లో నీరు చేరింది. అబీద్ సెంటర్లో నూకాలమ్మ తల్లి దేవాలయంలోకి వర్షపు నీరు విపరీతంగా చేరింది. కొత్త అమావాస్య సందర్భంగా ఇక్కడ జరుగుతున్న పండగ మహోత్సవంలో భాగంగా భక్తులు దేవాలయ దర్శనానికి వచ్చేటప్పుడు కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. తుఫాను కారణంగా నియోజకవర్గ నాలుగు మండలాల్లోనూ వర్షపాతం నమోదు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయం లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్లో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా పిల్లలతో కథల పుస్తకాలు చదివించడం, కథలో ఉన్న నీతిని తెలియపరచారు. ఆటల పాటలతో విద్యార్థులను అలరించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ దమయంతి మాట్లాడుతూ, పాఠకులు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు శాఖా గ్రంథాలయంలో జరిగే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా పిల్లలను ప్రోత్సహించాలని కోరారు.

23న పెండ్లి రాటోత్సవం

- ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో లక్ష్మణేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 23న గురువారం ఉదయం 9.30 గంటలకు శివయ్య పెండ్లి రాటోత్సవం జరుగుతుందని ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏప్రిల్ 1న భువనేశ్వరి దేవి సమేత లక్ష్మణేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలననుసరించి ఆలయంలో ముందుగా పెండ్లిరాట ఉత్సవం జరుగుతుందన్నారు. గురువారం జరిగే స్వామివారి పెండ్లిరాటోత్సవానికి భక్తులంతా హాజరు కావాలని కోరారు. గత ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆలయంలో పూజలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఆయుష్మాన్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయంలోని గోశాలలో ఆదివారం గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు వి రమేష్ మాట్లాడుతూ, 48 వారాలుగా గోపూజలు జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కృష్ణ, యలమర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు..

సతీష్‌కు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి సీతా సతీష్ కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన కవిత్వంలో రాణిస్తూ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడంతో తెలంగాణా రాష్ట్రం మంథనికి చెందిన శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సంస్థ ఆదివారం ఈయనకు ఉగాది నంది పురస్కారంతో పాటు, సాహితీ కిరణం బిరుదు ప్రదానం చేసి, పంచ లోహ కంకణం తొడిగి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన మహా కవి సమ్మేళనంలో సతీష్ అలల సవ్వడి అనే కవితను శ్రోతలకు వినిపించారు.సీతా సతీష్ కవిగా మరిన్ని అవార్డులు అందుకోవాలని సభలో పలువురు ఆకాంక్షించారు.

అవార్డు అందుకుంటున్న సతీష్

నూకాలమ్మ తీర్థానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట

ఏర్పాటు చేసిన జెయింట్ వీల్

నూకాలమ్మ తీర్థ మహోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొత్త అమావాస్య ముందు రోజు నుండి తొమ్మిది రోజుల పాటు జరిగే తీర్థ మహోత్సవాలకు లింగంపేట నూకాలమ్మ ముస్తాబవుతుంది. దేవాదాయ శాఖ నియమించిన ట్రస్ట్ చైర్మన్ బొందల నూకరత్నం ఆధ్వర్యంలో సోమవారం తొలి జాగారణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సవాలు సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ, గ్రామస్తుల సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇప్పటికే తీర్థంలో రంగుల రాట్నాలు, జెయింట్ వీలు సిద్ధమయ్యాయి. అత్యంత వైభవంగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఎడ్ల పందాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బోసిపోయిన చాపరాయి

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: గత మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఆదివారం చాపరాయికు పర్యాటకులు అధికంగా రాకపోవడంతో బోసి పోయింది. దీంతో, వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

నిర్మానుష్యంగా ఉన్న చాపరాయి

భలే ..బొప్పాయి!

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని దోసలపాడు గ్రామంలో పక్కుర్తి నూకరాజు పెరటిలో బొప్పాయి చెట్టుకు మిరపకాయ ఆకారంలో బొప్పాయి కాసింది. బొప్పాయి కాయ చూడ డానికి మిరపకాయ ఆకారం లో ఉండడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు ఈ బొప్పాయి కాయని చూసేం దుకు తరలి వచ్చారు.

పంట చుట్టూ ఏర్పాటు చేసిన చీరలు

చీరలమాటున మొక్కజొన్న పంట!

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో చినబొడ్డేపల్లి గ్రామంలో మొక్కజొన్న పంటకు రక్షణగా రైతులు చీర కట్టారు. ఖరీఫ్ అనంతరం రబిలో విస్తారంగా సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు అడవి పందులు, కోతులు, పక్షులు, కాకులు నుండి పంటకు ఇటువంటి నష్టం వాటిల్లకుండా గ్రామస్తులు పంట చుట్టూ చీరలు కట్టారు. పంటలకు చీడపీడల నుంచి రక్షించుకోవడం ఒక ఎత్తు అయితే పంటను కాపాడుకోవడానికి రైతులకు మరి కాస్త అదనపు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు ఆరు కాలం కష్టపడి పెట్టుబడులు పెట్టి పండించినా గిట్టుబాటు ధర రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో పంటకు రక్షణ కలిగించుకునేందుకు మరి కాస్త వ్యయ ప్రయాసలు కోర్చాల్సి వస్తుందంటున్నారు.మండల వ్యాప్తంగా ఇటువంటి దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.

సిపిఐ నేతల గృహ నిర్బంధం

ప్రజాశక్తి- నక్కపల్లి:జీవో 1 రద్దుకు పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో 20న చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఆదివారం మండలంలోని చీడిక గ్రామంలో సిపిఐ నేత అజయ్ ఇంటికి వెళ్లి ఆయన్ని హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ పోలీసులు తనను విజయవాడ వెళ్లకుండా అడ్డుకొని హౌస్ అరెస్టు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు జరప కూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జిఓ 1 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరన్నారు.

అజయ్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

పాయకరావుపేట:సభలు, సమావేశాలు, రోడ్డుషోలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బ్రిటిష్ కాలం నాటి జీవో 1 రద్దు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జున్‌రావు డిమాండ్ చేశారు. చలో అమరావతి నేపథ్యంలో పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేశారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోలు, వంటగ్యాసు, విద్యుత్ ఛార్జీలు, చెత్త పన్ను, ఇంటి పన్నులకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు జరిపే పోరాటాలను అణిచి వేయడానికి తీసుకువచ్చిన బ్రిటిష్ కాలం నాటి జీవో 1 రద్దు చేయాలని లేని పక్షంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం ప్రజలు చెప్తారని హెచ్చరించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన తీర్పుని గమనిస్తే రాష్ట్రంలో 2024లో జరిగే ఎన్నికలలో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెప్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా పెంచిన ధరలను తగ్గించి ప్రజల మన్నలను పొందాలని సూచించారు. లేని పక్షంలో ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు.

స్టేడియం లోపల అభిమానుల కోలాహలం

మ్యాచ్‌ను తిలకిస్తున్న మంత్రి అమర్‌నాథ్

నగరంలో క్రికెట్ సందడి

ప్రజాశక్తి - పిఎం.పాలెం

విశాఖ వేదికగా ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో జరిగిన భారత్ - ఆసీస్ రెండో వన్డే మ్యాచ్ క్రీడాభిమానుల్లో సందడి నింపింది. వన్డే మ్యాచ్‌తో మధురవాడ ప్రాంతం క్రికెట్ అభిమానులతో ఆదివారం ఉదయానికే కళకళలాడింది. స్టేడియం వీక్షకులతో కిక్కిరిసి పోయింది. రోడ్లన్నీ వివిధ వాహనాలతో కిటకిటలాడాయి. మ్యాచ్‌ను మంత్రి అమర్‌నాథ్, పలువురు ప్రముఖులు తిలకించారు. స్టేడియంలో సినీ హీరో నాని క్రికెట్ బ్యాట్‌తో కాసేపు సందడి చేశారు. స్టేడియం బయట పోలీస్ బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న హీరో నాని

మ్యాచ్ ఆడేందుకు వెళుతున్న ఇండియన్ క్రికెటర్లు

వికెట్ తీసిన ఆనందంలో ఆసీస్ క్రీడాకారులు

స్టేడియం బయట భారీ బందోస్తు

పిడుగుపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో పిడుగు పడి ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలో యల్లవరం గ్రామానికి చెందిన అల్లు సతీష్ గొర్రెలను మేతకు తీసుకొని వెళ్ళిగా శనివారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందాడు. వర్షం తగ్గిన తరువాత అక్కడకు సమీపంలో ఉన్న రైతులు చూసి అతని కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతి చెందిన యువకుడు

అచ్యుతాపురం: మండలంలో శనివారం రాత్రి భారీ వర్షంతోపాటు పడిన పిడుగుపాటుకు మోసయ్యపేట గ్రామానికి చెందిన పంచదార్ల రాములమ్మకు చెందిన రూ.లక్ష విలువ చేసే రెండు పాడే గేదెలు మృతి చెందాయి. పిడుగుపాటుతో తమకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేసి ఆదుకోవాలనికోరుతున్నారు. కాగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం

పలు చోట్ల పశువులు మృత్యువాత

వరకు పడిన అకాల వర్షానికి చెరుకు తోటలకు లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నువ్వు, జీడి మామిడి, మామిడి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గొలుగొండ: మండలంలోని గుండుపాల గ్రామ పంచాయతీ పరిధిలోని కామారెడ్డి రాజుకు చెందిన గేదెపై పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గేదె మృతితో సుమారు 30 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టం పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

అపారిశుధ్యానికి కేరాఫ్... కొడవటిపూడి రోడ్డు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో కొడవటిపూడి గ్రామానికి సంబంధించి ప్రధాన రహదారి అపారిశుధ్యానికి అడ్డాగా దర్శనమిస్తోంది. కొడవటిపూడి ప్రధాన కూడలి రహదారిలో గడిచిన దశాబ్ద కాలంగా రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు సమీపంలో ఇళ్ల నుండి వాడుకనీరు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా రోడ్డు దుస్థితి ఇలాగే ఉందని గ్రామస్తులు తెలిపారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వాన స్థితికి చేరుకోవడంతో పాటు మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా రాత్రి సమయంలో పాదచారులు, వాహనదారులు కూడా తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వాసులు ఈ రోడ్డుపై నుండి వాణిజ్య కేంద్రమైన తుని వెళ్లేందుకు దగ్గరగా ఉండడంతో రహదారి రద్దీగా ఉంటుంది. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు సహా అధికారులు, నాయకులు గ్రామాన్ని దర్శించి వెళ్ళారే గాని ఎటువంటి హామీలు, నిధులు మంజూరు చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు